క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు శిక్షణ

మోపిదేవి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కె. నవీన్ కుమార్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్స్‌కు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు, వాటి నాణ్యతపై అవగాహన కల్పించారు. పీఏసీఎస్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, సీఈఓ, టెక్నికల్ అసిస్టెంట్లు శిక్షణలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఆశీర్వాద పండుగలు

నాగాయలంక: స్థానిక షకీనా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు ఆశీర్వాద ఉజ్జీవ పండుగలు నిర్వహిస్తామని సంస్థ నిర్వాహకురాలు పూషడపు ప్రభుకుమారి బుధవారం తెలిపారు. నాగాయలంకలోని ఇమ్మడి సుబ్బయ్య ఫంక్షన్ హాల్‌లో వారం రోజుల పాటు ఉదయం 10 గంటలకు, సాయంత్రం 6 గంటలకు సభలు ప్రారంభమవుతాయన్నారు. ప్రధాన ప్రసంగీకులుగా సినీ నటి దివ్యవాణి (హైదరాబాద్), పాస్టర్ రంగరాజు (హిందూపురం), డాక్టర్ కెరోలిన్ సందీప (చెన్నై), బ్రదర్ సిరిల్ ఖన్నా పాల్గొంటారని చెప్పారు.

'పల్లెకు పోదాం'పై అవగాహన

కృత్తివెన్ను: పల్లెకు పోదాంపై వలంటీర్లకు అవగాహన కార్యక్రమం యండపల్లి సచివాలయం వద్ద బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ పిచ్చిబాబు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధిని వివరించడంతో పాటు వారి అవసరాలను గుర్తించి తక్షణ పరిష్కారం దిశగా కృషి చేసేందుకు పల్లెకు పోదాం కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు యండపల్లి సచివాలయం వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. దీనిపై ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరి వలంటీర్ల ద్వారా ప్రజలకు సమాచారం అందజేశారని చెప్పారు. దీనిపై యండపల్లి సచివాలయం వద్ద వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిన్నెంటి ప్రభుప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్ కాయిన్ అందజేత



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ఉత్తర చిరువోలులంక పాడి రైతు జంపాన నాగేశ్వరరావు కుమార్తె మౌనికకు కల్యాణ మస్తు పథకం కింద గోల్డ్ కాయిన్ అందజేశారు. బుధవారం ఉదయం సంఘ సభ్యుడు ఇంటి వద్ద అధ్యక్షులు రెడ్రౌతు వెంకట రమణ, కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా బోర్డు డైరెక్టర్ వేమూరి వెంకట సాయి రమణ చేతుల మీదగా గోల్డ్ కాయిన్ అందించారు. ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ గోళ్ల పూర్ణమల్లికార్జునరావు, పాల శీతలకేంద్రం మేనేజర్ సీహెచ్ దామోదర కృష్ణ గోపీనాథ్ పాల్గొన్నారు.

19 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 19 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నగరంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌మేళాలో ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డ్స్, ఫోన్‌పే, అపోలో ఫార్మసీ కంపెనీలు పాల్గొన్నాయి. 50 మంది అభ్యర్థులు పాల్గొనగా 19 మందికి ఉద్యోగాలు లభించాయి. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి డి. విక్టర్‌బాబు, యంగ్ ప్రొఫెషనల్స్ ఎస్. జయరాజు, డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఉత్పత్తులు మేలు



గూడూరు: సేంద్రియ విధానంలో సాగు చేసిన పంటల ఉత్పత్తులతో మానవాళికి ఎంతో మేలు జరుగుతుందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల విక్రయాలను బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గూడూరు మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, కరీముల్లా, మాగంటి నాగరాజు పాల్గొన్నారు.

భోజనం ప్లేట్ల అందజేత

పామర్రు: స్థానిక రావి హరిగోపాల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యా ర్థులకు దాత సహకారంతో భోజనం ప్లేట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం సరిపల్లి వెంకటరత్నాలు మాట్లాడుతూ మండల పరిధి జమీదగ్గుమిల్లి గ్రామానికి చెందిన గుడివాడ సాయిబాలాజీ జ్ఞాపకార్థం వారి తండ్రి గుడివాడ వెంకటేశ్వరరావు రూ.7 వేలు విలువ చేసే స్టీల్ ప్లేట్లను పాఠశాలలోని విద్యార్థులు భోజనం చేసేందుకు బహూకరించారన్నారు. సహ ఉపాధ్యాయులు ఎం.రామ్మోహన్‌రావు, పి. విజయకుమారి, శొంఠి అంకరవి పాల్గొన్నారు.

పుష్కలంగా తాగునీరు

- నిండుగా తాగునీటి చెరువులు
- తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు
- ప్రతి రోజూ నీటి సరఫరాకు త్వరలో రూ. 45 కోట్లతో పనులు
- 11 రిజర్వాయర్లు, పైప్‌లైన్ల నిర్మాణం



తరకటూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీరు



పుట్లమ్మ చెరువులో నిండుగా నీరు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా నగర పాలక సంస్థ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ప్రస్తుతం నగర ప్రజలకు రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తోంది. పైప్‌లైన్ లేని శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సాగునీటిని అందిస్తోంది. నగరంలోని హెడ్ వాటర్‌వర్క్స్‌లో నీటిని శుద్ధి చేసి మోటార్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపి నీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలో ప్రతి రోజూ 22 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేందుకు గానూ 16 మిలియన్ లీటర్లు, 22 మిలియన్ లీటర్ల నీటిని ప్రతి రోజు శుద్ధి చేసి సరఫరా చేసేందుకు ఫిల్టరేషన్ ప్లాంట్లు పనిచేస్తున్నాయి. నీటిని శుద్ధి చేసేందుకు ప్రతి రోజూ దాదాపు 2 టన్నులకు పైగా ఆలంను వినియోగిస్తున్నారు. మూడు పంపింగ్ స్టేషన్ల ద్వారా నగరంలోని 17 రిజర్వాయర్లను తాగునీటితో నింపి సరఫరా చేస్తున్నారు.

నిండుగా చెరువులు..

పంట కాలువల్లో ప్రస్తుతం పుష్కలంగా నీరు ఉండటంతో నగర ప్రజలకు నీటి సమస్య రాకుండా చూసేందుకు నీటిని నిల్వ చేసే చెరువులను పూర్తి స్థాయిలో నింపారు. రానున్న వేసవిలో సైతం నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే ముందస్తుగా తరకటూరులో 200 ఎకరాల్లో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను నింపారు. ఈ చెరువు సామర్థ్యం 5.19 మీటర్లు కాగా ఇప్పటికే 5 మీటర్ల మేర నింపారు. పుట్లమ్మ చెరువును కూడా పూర్తిస్థాయిలో నింపారు.

ప్రతి రోజూ నీటి సరఫరాకు త్వరలో పనులు

నగర ప్రజలకు ప్రతి రోజూ తాగునీటిని అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక కృషితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ. 45 కోట్లను మంజూరు చేశారు. ఈ నిధులతో నగరంలో మరో 11 ఓవర్‌హెడ్ ట్యాంకులను, పైప్‌లైన్లను, ఇతర పనులను చేపట్టనున్నారు. ఈ పనులకు ఇప్పటికే టెండర్లు పూర్తికాగా పనులు చేపట్టేందుకు అనుమతి ఇస్తూ ఇంజనీర్ ఇన్ చీఫ్ నుంచి నగర పాలక సంస్థకు ఉత్తర్వులు పంపారు. కౌన్సిల్ సమావేశం ఆమోదం అనంతరం ఈ పనులను ప్రారంభించేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం



నగర ప్రజలకు తాగునీటి సమస్య రానివ్వం. తాగునీటి సమస్యను అధిగమించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టి కృషితో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. వచ్చే వేసవిలో కూడా తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళిక సిద్ధం చేశాం. సీఎం జగన్, ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో నగర ప్రజలకు ప్రతి రోజూ తాగునీరు అందించేందుకు రూ. 45 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పనులు పూర్తయ్యాక నగర ప్రజలకు ప్రతి రోజూ నీటిని సరఫరా చేస్తాం. తాగునీరు, వీధి దీపాలు తదితర సమస్యలను ప్రజలు 9849907989 నెంబరుకు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తెలియజేయవచ్చు.

– చిటికిన వెంకటేశ్వరమ్మ, మేయర్

మరోసారి జగనే సీఎం కావాలి

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మోపిదేవి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి ఇంటికీ పలు రకాల సంక్షేమ పథకాలు అందించారని, మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశం మండల పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు గరికిపాటి వెంకటేశ్వరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఇంకా మరిన్ని మంచి పనులు చేపట్టేందుకు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. గురువారం సాయంత్రం మోపిదేవి గ్రామ సచివాలయం-1, 10న మోపిదేవి గ్రామ సచివాలయం-2, 14న కె. కొత్తపాలెం, 15న మెరకనపల్లి, 16న కొక్కిలిగడ్డ, 17న ఉత్తరచిరువోలులంక, 20న పెదప్రోలు, 21న పెదకళ్లేపల్లి-1, 22న పెదకళ్లేపల్లి-2, 23న నాగాయితిప్ప గ్రామ సచివాలయాల పరిధిలో కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించండి

- మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేయండి
- ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్
- ప్రమాణస్వీకారం చేసిన నూతన పాలకవర్గం



నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

కోనేరుసెంటర్: నూతన పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలు అందించి వారి అభిమానాన్ని పొందాలని బందరు, పామర్రు ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్ అన్నారు. మచిలీపట్నం మార్కెట్‌యార్డు కమిటీ నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే పేర్ని నాని బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. పేర్ని నాని మాట్లాడుతూ నూతన పాలకవర్గం మార్కెట్ యార్డు అభివృద్ధికి మరింత కృషి చేయాలన్నారు. నిబద్ధత కలిగిన నాయకుడి ఆధ్వర్యంలో నడుచుకునే మనమంతా ఆయన ఆలోచనలకు అనుగుణంగానే పాలన సాగించాలని చెప్పారు. చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న డేవిడ్ రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చైర్మన్‌గా డేవిడ్ పేరును ప్రతిపాదించగానే అంగీకరించారని తెలిపారు. అందుకు ముఖ్యమంత్రికి నూతన పాలకవర్గం తరపున కృతజ్ఞతలు తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతనే రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లోని నాయకులకు సముచిత స్థానాలు లభిస్తున్నాయన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనతేనని చెప్పారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ రాష్ట్రంలో పోటీలేని రాజకీయ నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని చెప్పారు. గాడెల్లి డేవిడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే పేర్ని నాని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్‌దాదా, మాజీ డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, బందెల కవిత, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్ అచ్చేబా, వైస్ చైర్మన్ తోట సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, బందెల థామస్ తదితరులు పాల్గొన్నారు.

ఊపిరి పోసిన వర్షాలు

- మూడు రోజుల నుంచి దివిసీమలో వర్షాలు
- ఎరువులు చల్లుకునే పనుల్లో రైతులు బిజీ
- నిండుగా ప్రవహిస్తున్న పంట కాలువలు
- అవనిగడ్డ నియోజకవర్గంలో రెండు రోజుల్లో 307 మి.మీ వర్షం



కోడూరు మండలం పిట్టల్లంకలో ఈనిక దశలో ఉన్న వరిపంట

అవనిగడ్డ: దివిసీమలో రైతులకు సాగునీటి కరువు తీరింది. గత 20 రోజుల నుంచి వర్షాలు లేక నెర్రెలిచ్చిన పంట పొలాలు బుధవారం వర్షం నీటితో నిండుగా ఉన్నాయి. అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1.04 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ముందుగా నాట్లు వేసిన ఘంటసాల, చల్లపల్లి మండలాల్లో వరి పంట పాలుపోసుకునే దశలో ఉంది. మోపిదేవి, నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో చిరుపొట్ట, ఈనిక, పాలు పోసుకునే దశలో వరి పొలాలు ఉన్నాయి. గత 20 రోజుల నుంచి సాగునీటి కోసం అర్రులు చాస్తున్న వరి పొలాలు మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఊపిరి పోసుకున్నాయి. ఈ వర్షాలు 15 రోజులు ముందు పడుంటే వరి పంట ఇంకా బాగుండేదని కొందరు రైతులు చెబుతున్నారు.

రెండు రోజుల్లో దివిసీమలో 307 మి.మీ వర్షపాతం..

గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం దివిసీమలోని వరి పొలాలకు జీవం పోసింది. మంగళవారం అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 167.4 మి.మీ వర్షపాతం నమోదైంది. చల్లపల్లిలో అత్యధికంగా 38.6 మి.మీ వర్షపాతం నమోదు కాగా, కోడూరులో 23.8 మి.మీ, మోపిదేవిలో 23 మి.మీ, అవనిగడ్డలో 19.2 మి.మీ, నాగాయలంకలో 15.2 మి.మీ, ఘంటసాలలో 10.8 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం నియోజకవర్గంలో మొత్తం 140.6 మి.మీ వర్షం కురిసింది. చల్లపల్లిలో అత్యధికంగా 35.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అవనిగడ్డలో 31.2 మి.మీ, నాగాయలంకలో 17.4 మి.మీ, కోడూరులో 16.8 మి.మీ, మోపిదేవిలో 16.6 మి.మీ, ఘంటసాలలో 10.4 మి.మీ, వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం మోపిదేవి, అవనిగడ్డ మండలాల్లో పలుచోట్ల కుండపోత వర్షం కురిసింది.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ..

గత మూడు రోజుల నుంచి దివిసీమలో విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మూడో కోటా ఎరువులు చల్లుకుంటున్నారు. కొంతమంది దోమ, పురుగు నివారణకు పురుగు మందు పిచికారీ చేసుకుంటున్నారు. ఈ వర్షం కూడా లేకపోతే వరి పంట దిగుబడులు సగానికి సగం పడిపోయేవని కొంతమంది రైతులు తెలిపారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల వరి పంటకు ఊపిరి పోసినట్లయిందని పలువురు రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమ కరపత్రాలను బుధవారం నాయకులు ఆవిష్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు పాలనలోని వ్యత్యాసాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు.

గురువారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించి సచివాలయ పరిధిలోని ప్రజలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తారని చెప్పారు. అదే గ్రామం, నగరంలో రాత్రి బస చేసి మరుసటిరోజు ఉదయం 8 గంటల నుంచి సచివాలయ పరిధిలో ప్రతి ఇంటికి ప్రభుత్వం అమలు చేసిన హామీల కరపత్రాలను పంపిణీ చేస్తామని వివరించారు. విలేకరుల సమావేశంలో కన్వీనర్లు వాలిశెట్టి రవిశంకర్, శొంఠి ఫరీద్, గూడవల్లి నాగరాజు, మేకల సుధాకర్‌బాబు (సుబ్బన్న), కాగిత జవహర్‌లాల్ నెహ్రూ (బున్ని) తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి'

నాగాయలంక: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. గురువారం భావదేవరపల్లిలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. 10న నాచుగుంట, 14, 15 తేదీల్లో నాగాయలంక ఒకటి, రెండు, 16న నంగేగడ్డ, 17న పర్రచివర, 20న రేమాలవారిపాలెం, 21న సంగమేశ్వరం, 23న ఏటిమొగ గ్రామాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

● **పెడన:** పెడన నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మధ్యాహ్నం రెండు గంటలకు ఒకటో వార్డు సచివాలయం వద్ద కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే విషయాన్ని ఆయా కుటుంబ సభ్యులను కలిసి అడిగి తెలుసుకుంటారన్నారు. మధ్నాహ్నం 12 గంటలకు జయలక్ష్మీ పీఏసీఎస్‌లో అదనపు గదులు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపింది. మండలంలోని బల్లిపర్రు గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం జరుగుతుందని మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు తెలిపారు.

● **అవనిగడ్డ:** అవనిగడ్డ మండలంలో గురువారం నుంచి పల్లెకు పోదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ మరియాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పులిగడ్డలో, 10వ తేదీన అవనిగడ్డ ఒకటో సచివాలయంలో, 14న మూడో సచివాలయం, 15న నాలుగో సచివాలయం, 16న వేకనూరు, 17న అవనిగడ్డ 2వ సచివాలయం, 20న అశ్వరావుపాలెం, 21న మోదుమూడి, 22న అవనిగడ్డ 5వ సచివాలయం, 23న దక్షిణ చిరువోలులంకలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

● **లక్ష్మీపురం(చల్లపల్లి):** ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం లక్ష్మీపురం శివారు రామానగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహణపై వైఎస్సార్ సీపీ మండల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమం నిర్వహించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● **కోడూరు:** వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించి వైఎస్సార్ సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు తదితరులు పాల్గొన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం వి.కొత్తపాలెంలో ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించి, రాత్రి అదే గ్రామంలో పల్లెనిద్ర చేస్తారని తెలిపారు. 10న విశ్వనాథపల్లి, 14న సాలెంపాలెం, 15న పిట్టల్లంక, 16న కోడూరు-1, 17న కోడూరు-2, 20న కోడూరు-3, 21న ఉల్లిపాలెం, 22న మందపాకల, 23న లింగారెడ్డిపాలెం సచివాలయాల పరిధిలో జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు.

యాచకుడి మృతదేహం కుటుంబ సభ్యులకు అప్పగింత

కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన యాచకుడి మృతదేహాన్ని ఇనగుదురుపేట పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్ని రోజులుగా మచిలీపట్నం రాజుపేట ప్రాంతంలో యాచిస్తూ తిరుగుతున్న ఓ వ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న ఆయన ఈ నెల 7వ తేదీన మృతిచెందాడు. ఆస్పత్రిలో చేరే సమయంలో యాచకుడు తన పేరు నక్షత్రపు వెంకటేష్ అని మాత్రమే చెప్ప గలిగాడు. అతను మృతిచెందడంతో జిల్లా ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు ఇనగుదురుపేట పోలీసులు ప్రసార మాధ్యమాల ద్వారా అతని ఫొటోతో పాటు వివరాలను అన్ని గ్రూపుల్లోకి ఫార్వర్డ్ చేయడంతో పల్నాడు జిల్లా మాచర్ల ప్రాంతానికి చెందిన మృతుని కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని బుధవారం మచిలీపట్నం చేరుకుని పోలీసులను ఆశ్రయించారు. మృతునికి సంబంధించిన ఆధారాలను పోలీసులకు చూపించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రామావత్తుల పంతులు (ఫైల్)

చల్లపల్లి: గత నెల 17న చల్లపల్లి ప్రధాన కూడలిలో పెట్రోల్ బంక్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన ఘటనలో మంటలు అంటుకుని గాయపడి చికిత్స పొందుతున్న మరో వృద్ధుడు కూడా మృతిచెందాడు. మోపిదేవి మండలం కాసానగర్‌కు చెందిన రిక్షా కార్మికుడు రామావత్తుల పంతులు (85) బంకు నుంచి రిక్షాలో నీళ్లు తీసుకుని వెళుతుండగా ట్రాన్స్ ఫార్మర్ పేలి పంతులు మీద పడటంతో ఆయన తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆయనను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటినుంచి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. పంతులు మృతదేహానికి పోస్టుమార్టం, శవ పంచనామా జరిపించి ఎస్ఐ సీహెచ్.చినబాబు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదే ఘటనలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, మంటలు పడి గ్రామానికి చెందిన మరో వృద్ధుడు పసుపులేటి చిన సాంబయ్య సెప్టెంబర్ 19న మృతి చెందిన విషయం తెలిసిందే.

అమృత్ స్టేషన్ స్కీమ్‌లో మచిలీపట్నం రైల్వేస్టేషన్

గూడూరు: కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పనకు రూపొందించిన అమృత్ స్కీమ్‌లో మచిలీపట్నం రైల్వేస్టేషన్ ఎంపికైందని రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు బుధవారం తెలిపారు. బుధవారం విజయవాడలోని డీఆర్‌ఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో రైల్వే అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించారని ఆయన చెప్పారు. మచిలీపట్నం రైతు బజారు సమీపంలోని రైల్వే టికెట్ కౌంటర్‌ను పునఃప్రారంభించాలని కోరామని చెప్పారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో ఎస్కలేటర్ సౌకర్యం, టూ వీలర్ పార్కింగ్ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరామన్నారు. మచిలీపట్నం పోర్టు నిర్మాణం, మెడికల్ కళాశాల ఏర్పాటుతో వేగంగా అభివృద్ధి చెందుతున్న మచిలీపట్నంలో రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరామని వివరించారు.

డిసెంబర్ 3న నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 3వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మారుతీ కాన్వెంట్‌లో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 90747 77544 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. శుక్లాలు ఉన్న వారికి శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని శేఖర్ వివరించారు.

సర్పంచ్‌పై విద్యుత్ శాఖ సిబ్బంది ఫిర్యాదు

కోనేరుసెంటర్: పెదయాదర సర్పంచ్ నుంచి తమకు రక్షణ కల్పించాలని విద్యుత్ శాఖ సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని చిన్నాపురం విద్యుత్ సెక్షన్‌లో లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ మేడిశెట్టి వెంకటలక్ష్మీపతిరామ్, యార్లగడ్డ అర్జున్ ఈ నెల 7న మండలంలో విద్యుత్ బకాయిలు అధికంగా ఉన్న వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో పెదయాదర గ్రామంలోని జనసేన పార్టీకి చెందిన సర్పంచ్ గల్లా తిమోతి తండ్రి లక్ష్మణరావు సర్వీసుకు సంబంధించి సుమారు రూ.60,313 చెల్లించాల్సి ఉండగా అతని సర్వీసును తొలగించారు. విషయం తెలుసుకున్న తిమోతి లైన్‌మెన్లకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని లైన్‌మెన్లు అధికారుల దృష్టిలో పెట్టి వారి సలహా మేరకు బందరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

గూడూరు: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గూడూరులో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. గూడూరులోని మండల సమైక్య సంఘ భవనంలో నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణాజిల్లా వినియోగదారుల ఫోరం కమిషనర్ సీహెచ్ కిషోర్‌కుమార్ వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవాడ ప్రశాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ బీమా మాస్టర్ ట్రైనర్ పుట్టి ఏసురత్నం, న్యాయవాది ముసలయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.కల్యాణి, ఏపీఎం శ్రీనివాస్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

గూడూరు: చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో గూడూరు మండలం కప్పలదొడ్డిలో హెచ్ఐవీ,ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ సూపర్‌వైజర్ బడుగు రాజేష్ హెచ్ఐవీ,ఎయిడ్స్ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవీ బాధితులకు ప్రభుత్వపరంగా అందిస్తున్న తోడ్పాటును వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శిరీష, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.